# ప్రణవ పద్మాకరం

బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

సత్యం వద - ధర్మం చర

శ్రీ ప్రణవ పీఠం

ఏలూరు

శుభకృత్, చైత్ర

ఏప్రిల్, 2022



## శ్రీ శుభకృత్ నామ
# ఉగాది
## శుభాకాంక్షలు





# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

ఏప్రిల్, ౨౦౨౨

సంచిక-4

సంపుటి-1

# విషయ సూచిక

| | | |
|---|---|---|
| సంపాదకీయం 1<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీ గణేశ పురాణం ౨<br>శ్రీమతి పాలగుమ్మి (వద్దిపర్తి) శ్రీవిద్య | శ్రీ వేంకటేశ్వర రహస్యం 3<br>శ్రీమతి నడుముక్కల (వద్దిపర్తి) శ్రీకలి |
| ఋషిచరిత్ర 5<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం | ఐశ్వర్యయోగం 6<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | పురాణంలో మహిళలు ౭<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| స్తోత్రమాలిక ౦౯<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | ఉగాది & శ్రీరామనవమి విశేషాలు 13<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | సత్సంగ సమాచారము 1౯<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారికి జయము జయము

శ్రీ మహాగణాధిపతయేనమః     శ్రీ గురుభ్యోనమః     శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు ,శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు

https://srivaddipartipadmakar.org


© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




## సంపాదకీయం




### కాలం-శక్తిస్వరూపం

భారతీయుల కాలగణనంలో సంవత్సరాలు, ఋతువులు, నెలలు, వారాలు ప్రముఖపాత్ర పోషిస్తాయి. ఈ కాలచక్రగతిని అనుసరించే జీవితచక్రం కొనసాగుతుంది. మానవుని పుట్టుక, జీవితం, మరణం అన్నీ కాలంలోనే అంతర్లీనమౌతున్నాయి. సంపదలు, ఆపదలు, మంచి, చెడులు అన్నీ కాలానికి అధీనాలే. "కాలోతి దురతిక్రమః" అన్నట్లుగా కాలప్రభావానికి గురికానిది సృష్టిలో ఏదీ లేదు. మనిషి జీవనక్రమమైనా మారుతుందేమో కాని ఋతుచక్ర గతి, కాలచక్ర విధి మారదు. కాలచక్రం గతి నిరంతరాయంగా, నిర్విరామంగా కొనసాగుతుంది. కాలం ఒక శక్తిస్వరూపం. 'కాలః కలయతామహమ్' అనే భగవద్గీతామార్గముననుసరించి కాలం మహాపవిత్రమైనది. కాలాన్ని వ్యర్థమూ, దుర్వినియోగము చేయకుండా అశాశ్వత భౌతికవస్తుసంపాదనలకే వినియోగించకుండా శాశ్వతమైన దైవతత్త్వాన్ని అన్వేషించడానికి వినియోగించాలి. భగవత్ స్వరూపమైన కాలమహిమ, విలువ తెలుసుకొని అందరూ ప్రవర్తించడం అవసరం. కాలానికి అనుగుణంగా, జీవితంలోని ప్రతి దశలోనూ జ్ఞానసముపార్జన అన్నది ఆపకుండా, దైవ చింతన మరియు సత్సాంగత్యంతో మనస్సుని లేదా హృదయాన్ని పవిత్రంగా ఉంచుకుంటే మనం సమర్థులం అవుతాము అప్పుడే జీవితం సార్థకం అవుతుంది. విష్ణు సహస్రనామస్తోత్రం ఈ విషయాన్నే తెలియచేస్తున్నది.

ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః |

ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః ||

కాలమునకు ప్రభువు అయినవాడు,మనోహరమైన రూపము కలవాడు మృత్యువు తానే అయినవాడు, హృదయమనే గుహలో పవిత్రమై ప్రకాశించువాడు, అన్నింటినీ గ్రహించువాడు, ఉగ్రస్వరూపుడు, సమస్త జీవులకు వాసమైన వాడు, సమర్థుడు, జీవులకు పరమ విశ్రాంతి స్థానమైనవాడు, అన్ని విషయములలో సమర్థుడైన ఆ పరమాత్మను స్మరిస్తూ, "ఋతువులలో వసంతఋతువును నేనే" అని గీతాచార్యుడు చెప్పినట్లు కాలాన్ని భగవద్రూపంగా భావిస్తే ప్రతిదినమూ పండుగే.

కాలాన్ని మనసౌలభ్యం కోసం, గణన కోసం సంవత్సరాత్మకంగా లెక్కించి, కాలాన్ని సకల దేవతాస్వరూపంగా భావించి, సంవత్సరకాల భవిష్యత్తును ముందుగా తెలుసుకొని, ఆయా సమయాల్లో దైవానుగ్రహ ప్రాప్తికి చేయాల్సిన సాధనాలను సిద్ధపరుచుకొనే ఒక శాస్త్రీయ ప్రణాళికే యుగాది. ఈ శుభకృత్ నామసంవత్సరము అశుభాలను తొలగించి శుభాలను అందించాలని ఆ పరమాత్మను ప్రార్థిద్దాం.

వద్దిపర్తి పద్మాకర్



# శ్రీ గణేశ పురాణం



విఘ్నేశ్వరునికి అనంత నామాలున్నాయి. అనేక అవతారాలున్నాయి. ఆయన లీలాగాథలు కూడా అనంతాలే. విఘ్నేశ్వరుడు నిర్గుణుడూ, సగుణుడు కూడా. అటువంటి గణేశ్వరునికి బాగా ఇష్టమైన పదహారునామాలు ఉన్నాయని, ఆ పదహారునామాలని భక్తితో తలచుకుంటే సకలశుభాలు కలుగుతాయని వ్యాసమహర్షి సెలవిచ్చాడు.

## విఘ్నేశ్వరుని పదహారునామాలు:

| | |
|---|---|
| 1. సుముఖుడు | 9. ధూమకేతుడు |
| 2. ఏకదంతుడు | 10. గణాధ్యక్షుడు |
| 3. కపిలుడు | 11. ఫాలచంద్రుడు |
| 4. గజకర్ణకుడు | 12. గజాననుడు |
| 5. లంబోదరుడు | 13. వక్రతుండుడు |
| 6. వికటుడు | 14. శూర్పకర్ణుడు |
| 7. విఘ్నరాజు | 15. హేరంబుడు |
| 8. గణాధిపుడు | 16. స్కందపూర్వజుడు |

ఇందులో ఒక్కొక్క నామానికి గల విశేషార్థాలను, వ్యుత్పత్తులను గురించి కూడా తెలుసుకుందాం. గత నెల సంచికలో మనము కపిలుడు అను నామమునకు అర్థాలను, విశేషాలను తెలుసుకున్నాం. ఈ సంచికలో ఇప్పుడు నాల్గవ నామం గురించి తెలుసుకొందాం. ఆ నామం **గజకర్ణకుడు :**

గజకర్ణుడు లేక గజకర్ణకుడు అనగా ఏనుగు చెవుల వంటి చెవులు కలిగినవాడు అని అర్థం. పెద్ద చెవులు అనగా అనేకమైన శాస్త్రాలు విన్న చెవులు అని నిగూఢార్థం. గణేశుడు తన పెద్ద చెవులతో వినదగినవి వింటాడు. అనవసరమైన వాటిని త్రోసివేస్తాడు. గజకర్ణక శబ్దార్థం బహుశ్రుతత్వం. (అనేక విద్యారహస్యములెఱిగిన పాండిత్యం) విన్నవన్నీ మనస్సునకు పట్టించుకోరాదు. "వినదగునెవ్వరు చెప్పిన, వినినంతనె వేగపడక వివరింపఁదగున్", అనే పద్యంలో చెప్పినట్లుగా ఏదైనా వినవలసిందే కానీ, విన్న తరవాత తొందరపడరాదు. విన్న దానిలో ఏది అసత్యం, ఏది సత్యం అనేవి తెలుసుకొని జ్ఞానంతో నడచుకోవాలి. ఈ సత్యం నిరూపించే నామం గజకర్ణక నామం. పరనింద వినరాదు. మంచిని మాత్రమే వినాలి అని బోధించే చెవులను గజకర్ణాలు అంటారు. పెద్దలు చెప్పే శాస్త్రరహస్యాలు చెవులు రిక్కించి విని తరించమని చెప్పే సాధకుడు అయిన వ్యక్తి రూపంలో ఉండే గణేశుని గజకర్ణకుడు అంటారు.

...ఇంకా ఉంది

*****

"స్నానం చేయకుండా వంట వండడం,

పొయ్యి వెలిగించడం చేయరాదు"



# శ్రీ వేంకటేశ్వర రహస్యము

పూర్వజన్మ సుకృతం వల్ల శ్రీవేంకటేశ్వర విలాసాన్ని లోకానికి సులభశైలిలో అందించిన పరమాత్మ స్వరూపుడు,సమర్థగురుడు, త్రిభాషామహాసహస్రావధాని, ప్రణవపీఠాధిపతి అయిన బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు నాకు జనకులయ్యారు. తల్లి శ్రీమతి రంగవేణి కూడా వేంకటేశ్వర భక్తురాలే. అందుకే శ్రీవేంకటేశ్వరుని లీలా రహస్యాలు వ్రాసే భాగ్యం నాకు కలిగింది. సప్తగిరులు అనేక దివ్యరహస్యాలకు నిలయాలు. యుగయుగాలుగా బ్రహ్మర్షులు, దివ్యర్షులు, మహర్షులు, రాజర్షులు, ఋషులు, మునులు, సాధకులు, యోగులు ఈ కొండపై సాధనలు చేస్తూనే ఉన్నారు. ఆ సాధనలన్నీ రహస్యాలే. కొండలలోని గుహలు రహస్యాలే. జలపాతాలు రహస్యాలే. వృక్షాలు, జంతువులు, కీటాలు, ఇంతెందుకు ఈ కొండలోని అణువులన్నీ రహస్యాలే. ఆ రహస్యాలలో భగవంతుడు అందించిన మేరకు కొన్ని భక్తులకు అందించే ప్రయత్నం చేస్తాను. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవానికి సంబంధించిన రహస్యాలను తెలుసుకుంటున్నాం, అందులో భాగంగా ఈ సంచికలో మరిన్ని విషయాలు తెలుసుకుందాం.



“మూఢుడా! అజ్ఞానులు శరీరంపై దృష్టి పెడతారు. జ్ఞానులు శరీరానికి విలువనివ్వరు. శరీరం లావుగా ఉందా! సన్నగా ఉందా! సుందరమా! అసుందరమా! ఇవేవీ మహాత్ములకు అవసరం లేదు. ఆత్మసౌందర్యాన్ని, జీవులలోగల బ్రహ్మజ్ఞానాన్ని మాత్రమే మహాత్ములు స్వీకరించి గ్రహిస్తారు. నా భౌతికశరీరం చూసి అవహేళన చేసిన నీవు, వికృతమైన భయంకరమైన ఆకారం పొంది, ప్రాణులకు భయం, జుగుప్స కలిగిస్తూ జీవించు” అని నన్ను శపించాడు. నాకు భయం, ఆందోళన, పశ్చాత్తాపం కలిగాయి. అగస్త్యుని పాదాలపై బడి రక్షించమనీ, శాపం తొలగించమనీ ప్రార్థించాను. అప్పుడాయన జాలిపడి శాపవిముక్తిని ప్రసాదిస్తూ ఇలా అన్నాడు – నాయనా! శాపం తొలగించలేను. కానీ శాపావధి సూచిస్తాను. పరమపవిత్రమైన సప్తగిరులలో నివాసం ఏర్పరచుకో. దురాచారులు ఆ కొండపైకి వచ్చినపుడు, వారిని మాత్రమే భక్షించు. క్రూరులు, దురాచారులు, వ్యసనపరులు, నాస్తికులకు ఆ కొండపై నివసించే అర్హతలేదు. మహాత్ములు కనపడినపుడు వారికి నమస్కరించు. కొంతకాలానికి శ్రీరామచంద్రుడు, లక్ష్మణునితో ఆ కొండపైకి వచ్చి నీకు దర్శనమిస్తాడు. ఆయన నిన్ను అనుగ్రహించగానే నీకు శాపవిముక్తి అవుతుంది.



"శ్రీరామా! అగస్త్యుని ఆజ్ఞతో నేనీ కొండపైకి వచ్చి ఆయన చెప్పినట్లే నడచుకొంటున్నాను. చేసిన అపరాధానికి పశ్చాత్తాపపడుతూ, ఈ నీచాకృతి ఎప్పుడు తొలగుతుందా అని ఎదురుచూస్తూ, నీరాక కోసం తపిస్తున్నాను. నన్ను అనుగ్రహించు. శాపవిముక్తుడిని చేయి." మణిభద్రుని మాటలు విన్న రాముడు, 'యథారూపంతో యక్షలోకానికి వెళ్ళు' అని ఆశీర్వదించాడు. ఆ క్షణమే యక్షునిగా మారి మణిభద్రుడు రాముని కీర్తిస్తూ తన రాజైన కుబేరుని వద్దకు వెళ్ళిపోయాడు. ఈ విధంగా యక్షశాపమోక్షం చేసిన రాముని హనుమంతుడు భక్తితో పూజించి మరలా ప్రయాణం కొనసాగించాడు. అంజనాశ్రమానికి శ్రీరామలక్ష్మణులు, హనుమంతుడు చేరుకొన్నారు. అప్పటికే వానరులు కూడా అక్కడకు వచ్చారు. అంజనాదేవి ఆశ్రమం అనేక కందమూల ఫలాలతో నిండి ఉంది. గంగాధార నిరంతరం అక్కడ జలపాత రూపంలో ప్రవహిస్తుంటుంది. శ్రీరామాదులు స్నానాలు చేసి, సంధ్యావందనాదులు ముగించుకొన్నారు. అంజన రామలక్ష్మణులను పూజించింది. ఫలమూలాలు సమర్పించింది. వారు ఆ పూట ఆమె ఆశ్రమగుహలో విశ్రాంతి తీసుకొన్నారు. సుగ్రీవుడు, అంగదుడు, మున్నగు వారు అంజనాదేవి ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం జాంబవంతుడు స్వామి పుష్కరిణికి వెడదాం రమ్మని వానరులందరినీ వెంటబెట్టుకొని వెళ్ళాడు. సరస్వతీనదీస్వరూపిణి, పరమపవిత్ర అయిన పుష్కరిణిని చూడగానే వారందరికీ పులకింతలు కలిగాయి. సంకల్ప పూర్వకంగా వానరులు అందులో స్నానాలు చేసారు. ఆ ప్రాంతంలో, మధురఫలాలు, కందమూలాలు సమృద్ధిగా ఉన్నాయి. వానరులు అవన్నీ కడుపారా తిన్నారు. తేనెపట్లు చించి మధువును త్రాగారు. అప్పుడు అంగదుడు వారితో ఇలా అన్నాడు — "వానరవీరులారా! ఈ పర్వతం పరమ పవిత్రమైనది. అత్యద్భుతమైనది. ఈ వేంకటాచలంపై ఎంతసేపు విహరించినా ఇంకా ఇంకా విహరించాలనే కోరిక పెరుగుతున్నది కాని తరగడం లేదు. ఈ రాత్రికి ఇక్కడే విశ్రాంతి తీసుకొందాం."

అంగదుని పలుకులకు అందరూ సరేనన్నారు. అక్కడ నిద్రించడానికి సంసిద్ధులు అవుతుండగా వారందరికీ ఒక ఆశ్చర్యదృశ్యం కనబడింది. స్వామి పుష్కరిణికి ఈశాన్య భాగంలో అప్పటి దాకా ఏమీ లేని శూన్యంలో హఠాత్తుగా ఒక కొండగుహ కనబడింది. ఆ గుహ నుండి అపూర్వకాంతి బయటకు వస్తున్నది. అంగద, జాంబవత్, గజ, గవయ, గవాక్ష, గంధమాదన, మైంద, ద్వివిదాది వానరులు హఠాత్తుగా కనిపించిన ఆ కొండగుహను చూచి విస్మయం పొందారు. అదేమిటో చూడాలనుకొన్నారు. మహావేగంగా ఆ గుహలోనికి ప్రవేశించారు.

...ఇంకా ఉంది

*****

## గురుబోధ

విగ్రహారాధన కంటే లింగారాధన తొందరగా ఫలితం ఇస్తుంది. విగ్రహారాధన కంటే లింగారాధన లో ప్రకృతి, పురుషుడు ఇద్దరూ ఉంటారు. విగ్రహంలో కొంత శక్తి తక్కువగా ఉంటుంది. కానీ లింగంలో సంపూర్ణ ప్రకృతి. అనగా ఈ భూమి మీద ఉన్న ఈ చెట్లు, గుట్టలు, మిట్టలు వీటన్నింటి శక్తి ఉంటుంది. ప్రకృతి అంటే రెండో అర్థం అమ్మవారు పార్వతి. పార్వతియే శివలింగంలో క్రింద ఉన్న పానవట్టం. లింగాకారంలో పైన ఉన్నటువంటిది శివుడు. కాబట్టి ప్రకృతి పరమేశ్వరుడి యొక్క కలయిక అపూర్వమైన శివలింగం. ఎవరైనా భక్తితో శివలింగాన్ని చూచినా, శివలింగం మీద ఇన్ని నీళ్ళు పోసినా, పత్రి పెట్టినా, ఎదురు కూర్చుని ఆ శివలింగాన్ని మనస్సులో భావన చేసి "శివ శివా" అన్నా అటువంటి వాడ్ని చాలా తొందరగా అనుగ్రహిస్తాడు పరమాత్మ. అసలు ఈ భావన చేసేవాడికి సాధకుడు,అంటే శివుడ్ని పొందటానికి ప్రయత్నించువాడని అర్థం.

*****



# ఋషి చరిత్ర

గత సంచిక లో అగస్త్యుడి జన్మకు సంబంధించిన విషయాలను కొన్ని తెలుసుకున్నాం. ఈ సంచికలో మరిన్ని విషయాలు తెలుసుకుందాం. సూర్యభగవానుడికి ఆమెపై ఉన్న గాఢప్రేమ వల్ల, వ్యామోహం వల్ల హఠాత్తుగా సూర్యభగవానుడి యొక్క వీర్యం స్ఖలనమైపోయింది. వెంటనే ఆయన తెల్లబోయి, ఆ రేతస్సును ఒక కుండలో వేసాడు. అదే సమయంలో వరుణదేవుడి రేతస్సు స్ఖలనమైంది. వరుణదేవుడు తన రేతస్సును సూర్యభగవానుడు వేసిన కుండలోనే వేసాడు. ఆ కుండలో రేతస్సులు రెండూ గిర్రున తిరిగి అందులో నుండి ఇద్దరు పుట్టుకొచ్చారు. వారిని కుంభసంభవులు అంటారు. సూర్యభగవానుడు, వరుణదేవుడి రేతస్సుల కలయికతో పుట్టడం వల్ల ఆ ఇద్దరు పిల్లలని మైత్రావరుణులు అంటారు. అందులో ఒకాయన వశిష్ఠమహర్షి, రెండవవాడు అగస్త్యుడు. ఇద్దరూ కుంభసంభవులు. అగస్త్యుడికి ఇది మొదటి జన్మ. ఆయన కావాలనే కొంచం పొట్టిగా, బొజ్జతో ఉంటాడు. ఆయన పుట్టీపుట్టగానే బ్రహ్మలోకం వెళ్లి, “బ్రహ్మదేవా! నీ అనుగ్రహంతో కుండలో నుంచి పుట్టాను. ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి?” అనగా, “నాయనా! నువ్వు మహాతపస్సు చేసి రుద్రుడ్ని మెప్పించు. రుద్రానుగ్రహం ఉంటే ఏదైనా సాధించవచ్చు. నువ్వు లోక శ్రేయస్సు కోసం పుట్టావు. ముఖ్యంగా రాబోయే కలియుగంలో మానవులకు గొప్ప సందేశం ఇవ్వడానికి పుట్టావు. వాళ్ల కోసం ధర్మములు రచించు”, అన్నాడు. అగస్త్యుడ్ని కాశికాక్షేత్రమునకు వెళ్లి గంగా తీరమున పరమేశ్వరుడి గురించి నిరాహారిగా తపస్సు చేయి అన్నాడు బ్రహ్మ. వెంటనే అగస్త్యుడు బ్రహ్మగారికి నమస్కరించి పరమపవిత్రమైన కాశికాక్షేత్రానికి చేరి రోజూ గంగలో స్నానం చేసి తరువాత ఇసుక తిన్నెమీద నల్ల జింక చర్మం మీద కూర్చుని ఒళ్ళంతా విభూతి ధరించి “ఓం నమః శివాయ” అనుకుంటూ తపస్సు చేయసాగాడు.



కలియుగంలో జింక చర్మాలు నిషిద్ధం, వాటి బదులు దర్భలపై కూర్చుని జపం చేయాలి. అగస్త్యుడు ఎప్పుడూ కాశీలో తిరుగుతున్నప్పుడు ఒంటి నిండా విభూతి పూసుకుని శివుడే నన్ను సృష్టించి,ఈ శరీరం ఇచ్చి అన్నం పెడుతున్నాడు. ఆయనే తింటున్నవాడు. ఆయనే అంతా... సర్వం శివమయం” నేనే శివుడ్ని. శివోహం అనేవాడు. “శివుడే సర్వము, నే శివుండననుచున్ చింతింపుచున్ పాడుచున్” ఆయన్నే తలుచుకునేవాడు. ఆయన ఆశ్రమంలో ఉన్న మారేడు చెట్ల మధ్యలో భస్మం తోటే స్నానం చేసి భవ! కాశీధవ! నీలకంఠ! అభవ! అని నిరంతరం కీర్తిస్తూ, పాడుకుంటూ ఉండేవాడు. అలా అగస్త్యుడు ఒక వెయ్యి సంవత్సరాల కాలం కాశీలో తపస్సు చేసాడు. ఆ తపస్సుకి ఆయన శరీరం వేడెక్కింది.

...ఇంకా ఉంది

*****



# ఐశ్వర్య యోగం

శ్రీ మహాగణాధిపతయేనమః        శ్రీ మాత్రేనమః        శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం  అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తన జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము.

## 306. రాజ్ఞీ [ఓం ఐం హ్రీం శ్రీం రాజ్ఞ్యై నమః]



రాజుగారి భార్యను 'రాజ్ఞీ' అని పిలుస్తారు. అమ్మవారు మహాకామేశ్వరుని సృష్టించుకొని ఆయనకు రాజరాజేశ్వరుడు అని పేరుపెట్టి ఆయనకు పత్ని అయ్యింది. రాజేశ్వరుని పత్ని అవ్వడం వలన అమ్మవారికి 'రాజ్ఞీ' అనే నామం ఏర్పడింది. ఎవరెవరిలో ఏయే శక్తులున్నాయో అవన్నీ అమ్మవారి స్వరూపాలే. అమ్మవారి విభూతులే. మహారాజుల పత్నులైన రాణులందరి రూపంలోనూ ఉండే అమ్మవారిని రాజ్ఞి అంటారు. అనుకూలవతి అయిన భార్య అని కూడా మరొక అర్థం ఉన్నది.

**మంత్రప్రయోగం-ఫలితం:** అనుకూలుడైన భర్త, అనుకూలవతి అయిన భార్య కావాలి అని కోరుకొనే పురుషుడు, స్త్రీ ఈ మంత్రాన్ని జపించుకొంటే వారి కోరిక నెరవేరుతుంది. నలువది దినాలు [40] ఈ మంత్రాన్ని రాత్రిపూట జపించాలి. స్నానానంతరం కాని లేదా కాళ్ళు చేతులు కడుగుకొని కాని ఈ మంత్రజపం చేయాలి. స్త్రీ అనుకూల భర్త కావాలనీ, పురుషుడు అనుకూల భార్య కావాలనీ సంకల్పం చెప్పకొని చాప లేక పీట మీద కూర్చుని ఈ మంత్రానుష్ఠానం (108 సార్లు) చేసుకొని, జపం అయ్యాక కొద్దిగా పాలు అమ్మవారికి నివేదించి త్రాగితే, అనుకొన్న కోరికలు నెరవేరుతాయి.

*... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో*



# పురాణం లో మహిళలు



భగవంతుడు భక్త సులభుడనుటకు రామాయణంలో 'శబరి' వృత్తాంతం మంచి ఉదాహరణ. త్రేతాయుగ కాలంలో అడవుల్లో అడుగడుగున ఋషులు, మునులు ఆశ్రమాలు నిర్మించుకొని వేదాధ్యయనము చేస్తున్న రోజులలో దండకారణ్యములో ఒక స్త్రీ నివాసముండేది. ఆమె పేరే **శబరి**. మతంగముని ఆశ్రమపరిసరాల్లో నివాసముంటూ మునులు వెళ్ళే మార్గంలో రాళ్ళు, ముళ్ళు లేకుండా నిరంతరం శుభ్రపరుస్తూ వారికి సేవచేస్తూ మతంగమునిచే భగవంతుని నామాన్ని పొంది, ఆ నామాన్ని జపిస్తూ కాలం గడుపుతున్నది. ఆమె యొక్క నిర్మలమనస్సు, నిశ్చలగురుభక్తి, అచంచల దీక్ష అక్కడి మునులకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

మతంగముని తన శరీరాన్ని విడిచిపెట్టాలనుకున్న సందర్భంలో వ్యాకులత చెందిన శబరి మతంగమునిని ఈ విధంగా వేడుకొన్నది:

"ఓ మునిపుంగవా! మీరు ఒక్కరే దేహత్యాగము చేయవద్దు. మీతో పాటు ఈ అభాగ్యురాలిని కూడా తీసుకొనివెళ్ళండి" అని ప్రార్థించింది. అప్పుడు మతంగ ముని – "ఓ భక్తురాలా! సాక్షాత్ శ్రీమన్నారాయణ స్వరూపుడైన శ్రీరామచంద్రమూర్తి చిత్రకూటములో ఉన్నారు. ఇచ్చటకు తప్పక వస్తారు. ఆయన దర్శనంతో నీ జీవితం ధన్యమవుతుంది. ఆ దీనజనరక్షకునకు సేవ చేసి నీ జీవితాన్ని సఫలం చేసుకో, అప్పటివరకు నీవు రామనామజపాన్ని చేస్తుండమని మతంగమహర్షి ఆజ్ఞాపించాడు. గురుసేవలో జీవితం సమర్పించుకొని, గుర్వాజ్ఞను శిరసావహించి శ్రీరాముని దివ్య సందర్శన భాగ్యం కోసం కాలాన్ని లెక్కించుకొంటూ కాలం వెళ్ళదీసింది.

ఆమె ఎదురుచూపులు ఫలించి ఒకనాడు రాముడు వస్తున్నాడన్న వార్తతో ఆమె మైమరపుతో రేగు మొదలగు పండ్లను, సరోవరం నుండి నీళ్ళను తెచ్చి సిద్ధంగా ఉంచి,

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



రాముని రాకకై ఎదురు చూస్తున్నది. రాముడు "శబరి ఎక్కడ?" అని అడుగుతూ శబరి పర్ణశాల వైపుకు తన సోదరుడు లక్ష్మణుని సమేతంగా విచ్చేసాడు. రామచరితమానసంలో తులసీదాసు రాముని దర్శించిన శబరి మానసిక స్థితిని అద్భుతంగా వర్ణించాడు. "ఈ రోజు శబరి ఆనందమునకు హద్దులు లేవు. ఆమె రామునిపై ప్రేమతో పరవశించిపోయి, చేతితో చప్పట్లు చరుస్తూ, నృత్యం చేస్తూ ఆనందాతిశయాలను పొందింది. రాముని కాళ్ళపై పడి ఆ దివ్యచరణాలను పూజించింది." అని వర్ణించాడు. ఈ విధంగా అవ్యాజకరుణామూర్తిని దర్శించిన శబరి తన్మయురాలై ఉన్న స్థితిని చూసి శ్రీరాముడు సంతోషించాడు.

అర్ఘ్య, పాద్య, ఆచమనాదులతో శబరి రామలక్ష్మణులను సేవించినది. ఆమె సేవలకు సంతోషించిన రాముడు ఆమెను నీకు ఏమి కావాలని అడుగగా శబరి, ఈ విధంగా పలికినది — "ఓ భగవంతుడా! నీ దర్శనభాగ్యవిశేషము చేత నా తపస్సు సిద్ధించి, నా జన్మసార్థకమైనది. నా గురువుల పూజలు సఫలీకృతములైనవి. నాకు ముక్తి కలుగుట తథ్యము. నేను సేకరించిన పండ్లు స్వీకరింపుము", అని వేడుకొనగా అత్యంత ప్రేమతో శబరి యిచ్చిన పండ్లను ఆ పరమాత్ముడు ఆరగించి శబరి కోరిక తీర్చాడు. శ్రీరాముడు మాట్లాడుతూ, "ఓ భక్త శిరోమణి! నన్ను ఎవరైతే భక్తితో సేవిస్తారో వారికి నేను బద్ధుడను. జాతి, కులము, ధర్మము, డబ్బు, కుటుంబము, తెలివి ఇలాంటివన్నీ వున్నా, భక్తి లేనిచో వారు, నీరు లేని మేఘము వంటివారు. అలాంటి వారి జీవితము వ్యర్థము. భక్తప్రియోమాధవః అన్న విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవాలి. ఈ విషయాన్ని ఆధ్యాత్మరామాయణంలోని దశమసర్గములో శబరి సమాగమ వృత్తాంతంలోని క్రింది శ్లోకములు మనకు తెలియచేస్తున్నవి.

పుంస్త్వే స్త్రీత్వే విశేషో వా జాతి నామాశ్రమాదయః
న కారణం మద్భజనే భక్తి రేవ హి కారణమ్
యజ్ఞ దాన తపోభిర్వా వేదాధ్యయన కర్మభిః
నైవ ద్రష్టుం మహం శక్యో మద్భక్తి విముఖైః సదా
(ఆ.రా.స.10 శ్లో.20,21)

అనగా పురుషుడు, స్త్రీ అనే భేదము కానీ, జాతి, నామ, ఆశ్రమాది భేదములు కానీ, నా భజనకు కారణములు కావు. వాస్తవముగా ఒక్క భక్తియే నాకు ప్రియమైనది. నా పట్ల ఎవరైనా భక్తి కలిగి ఉండకుండా ఎన్ని యజ్ఞదానతపముల వలన కానీ, వేదాధ్యయనాది కర్మల వలన కూడా నన్ను పొందలేరని రాముడు స్వయంగా తెలియపరచాడు. అంతేకాక నవవిధ భక్తి మార్గాలను ఆమెకు వివరించాడు. నీవు నా యందు అపరిమితమగు ప్రేమతో నవవిధ భక్తి మార్గములను అవలంబించినదానవు కనుకనే నేను నిన్ను అనుగ్రహించదలచాను. నీకు ఏ వరము కావలెనో కోరుకొనుము అని రాముడు పలుకగా - అప్పుడు శబరి, "శ్రీరామా! నేను ఎల్లప్పుడు నీపై భక్తి కలిగి ఉండు విధముగా నాకు వరమునిమ్ము" అని అనగా శ్రీరాముడు 'తథాస్తు' అన్నాడు. మరలా శబరి, "రామా ! నీవు అనుమతి ఇచ్చినట్లైతే నీ సమక్షముననే అగ్నిప్రవేశముచేసి మా గురుదేవుల సన్నిధానమునకు చేరుకొంటాను, అని వేడుకొన్నది. దానికి ప్రతిగా రాముడు "అమ్మా! శబరి! నీచే అర్చించబడ్డాను. నీ కోర్కెననుసరించి నీకు తగిన మోక్షము లభించును. అప్పుడు శబరి రామలక్ష్మణులు, మునులు చూస్తుండగా అగ్ని యందు ప్రవేశించి శరీరాన్ని వదలినది. శబరి నిశ్చలమైన భక్తికి పరవశుడైన రామచంద్రుడు ఆమెకు మోక్షమును ప్రసాదించాడు. సద్గురుకటాక్షము చేత ఆమెకు ఈ విధమైన భగవదనుగ్రహము కలిగినది. మనం కూడా నిశ్చలభక్తితో సద్గురువుల అనుగ్రహంతో ముక్తి పొందుదాము.



## స్తోత్రమాలిక

# శ్యామలాదండకమ్

ధ్యానం

మాణిక్యవీణా ముపలాలయంతీం మదాలసాం మంజుల వాగ్విలాసామ్ ,

మాహేంద్రనీలద్యుతికోమలాంగీంమాతంగకన్యాం మనసా స్మరామి ,1

చతుర్భుజే చంద్రకళావతంసే కుచోన్నతే కుంకుమరాగశోణే,

పుండ్రేక్షుపాశాంకుశపుష్పబాణహస్తే నమస్తే జగదేకమాతః ౨

మాతా మరకతశ్యామా మాతంగీ మధుశాలినీ,

కుర్యాత్ కటాక్షం కల్యాణీ కదంబవనవాసినీ 3

జయ మాతంగతనయే జయ నీలోత్పలద్యుతే,

జయ సంగీతరసికే జయ లీలాశుకప్రియే. 4

దండకం

జయ జనని సుధా సముద్రాంతరుద్యన్మణిద్వీప సంరూఢబిల్వాటవీమధ్య కల్పద్రుమా కల్పకాదంబ కాంతారవాసఃప్రియే కృత్తివాసఃప్రియే, సాదరారబ్ధ సంగీత సంభావనా సంభ్రమాలోల నీపస్రగాబద్ధ చూళీసనాథత్రికే, సానుమత్పుత్రికే, శేఖరీభూత శీతాంశురేఖా మయూఖావలీనద్ధ సుస్నిగ్ధనీలాలక శ్రేణిశృంగారితే లోకసంభావితే, కామలీలా ధనుస్సన్నిభభ్రూలతా పుష్ప సందేహ కృచ్చారు గోరోచనా పంకకేళీలలామాభిరామే సురామే రమే, ప్రోల్లసద్వాళికా మౌక్తికశ్రేణికా చంద్రికామండలోద్భాసి గండస్థలన్యస్త కస్తూరికాపత్రరేఖాసముద్భూతసౌరభ్య సంభ్రాంత భృంగాంగనాగీత సాంద్రీభవన్మంద్రతంత్రీస్వరే భాస్వరే, వల్లకీవాదనప్రక్రియా లోలతాళీదళాబద్ధ తాటంకభూషావిశేషాన్వితే సిద్ధసమ్మానితే, దివ్యహాలామదోద్వేల హేలాలసచ్చక్షురాందోళన శ్రీసమాక్షిప్తకర్ణైక నీలోత్పలే నిర్మలే, స్వేదబిందూల్లసత్ఫాలలావణ్య నిష్యందసందోహసందేహకృన్నాసికామౌక్తికే సర్వమంత్రాత్మికే, కుందమందస్మితోదారవక్త్రస్ఫురత్పూగ కర్పూర తాంబూల ఖండోత్కరే శ్రీకరే, కుందపుష్పద్యుతిస్నిగ్ధ దంతావళీనిర్మలాలోలకల్లోలసమ్మేళన స్మేర శోణాధరే చారువీణాధరే, సులలితనవయౌవనారంభ చంద్రోదయోద్వేలలావణ్య దుగ్ధార్ణవావిర్భవత్కంబు బిబ్బోకహృత్కంధరే మంథరే, బంధురచ్ఛన్నవీరాధిభూషాసముద్ద్యోతమానానవద్యాఙ్గశోభే శుభే, రత్న కేయూరరశ్మిచ్ఛటాపల్లవప్రోల్లసద్దోర్లతారాజితే యోగిభిః పూజితే, విశ్వదిఙ్మణ్డలవ్యాప్తిమాణిక్య తేజస్స్ఫురత్కంకణాలంకృతే సాధుభిస్సత్కృతే, సంగరారంభవేళా



సముజ్జృంభమాణారవింద ప్రతిచ్ఛందపాణిద్వయే సంతతోద్యద్వయే దివ్యరత్నోర్మికా దీధితిస్తోమసంధ్యాయమానాంగుళీ పల్లవోద్యన్న ఖేందుప్రభామండలే ప్రోల్లసత్కుండలే, తారకారాజినీకాశహారావళిస్మేరచారు స్తనాభోగభారానమన్మధ్యవల్లీ వళిచ్ఛేదవీచీసముద్యత్సముల్లాస సందర్శితాకార సౌందర్యరత్నాకరే శ్రీకరే, హేమకుంభోపమోత్తుఙ్గవక్షోజ భారావనమ్రే త్రిలోకావనమ్రే, లసద్వృత్తగంభీరనాభీసరిత్తీర శైవాలశంకాకర శ్యామరోమావళీ భూషణే మంజుసంభాషణే, చారుశింజత్కటీ సూత్రనిర్భర్త్సి తానంగలీలాధనుశ్శింజినీడంబరే దివ్యరత్నాంబరే, పద్మరాగోల్లసన్మేఖలా భాస్వరశ్రోణి శోభాజిత స్వర్ణభూభృత్తలే, చంద్రికాశీతలే, వికసితనవకింశుకాతామ్రదివ్యాంశుకచ్ఛన్నచారూరుశోభాపరాభూత సిందూరశోణాయమానేంద్ర మాతంగహస్తార్గళే శ్యామలే, కోమలస్నిగ్ధనీలోత్పలోత్పాదితానంగతూణీర శంకాశరోద్దామ జంఘాలతే చారులీలావతే, నమ్రదిక్పాలసీమంతినీ కుంతలస్నిగ్ధ నీలప్రభాకంజ సంజాతదూర్వాంకురాశంక సారంగసంయోగరింఖన్నఖేందూజ్జ్వలే ప్రోజ్జ్వలే, దేవి దేవేశ దైత్యేశ యక్షేశ భూతేశ వాగీశ కోణేశ వాయ్వగ్ని మాణిక్య సంఘృష్ట కోటీర బాలాతపోద్దామలాక్షారసారుణ్యలక్ష్మీగృహీతాంఘ్రిపద్మద్వయే అద్వయే, సురుచిర నవరత్న పీఠస్థితే సుస్థితే, శంఖపద్మద్వయోపాశ్రితే ఆశ్రితే, దేవి దుర్గావటుక్షేత్రపాలైర్యుతే, మత్తమాతంగ కన్యాసమూహాన్వితే, భైరవైరష్టభిర్వేష్టితే, దేవి వామాదిభి స్సంశ్రితే లక్ష్మ్యాది శక్త్యష్టకాసేవితే, భైరవీసంవృతే, పంచబాణేన రత్యా చ సంభావితే, ప్రీతిశక్త్యా వసంతేన చానన్దితే, భక్తిభాజాం పరం శ్రేయసే కల్పసే, ఛందసా మోజసా భ్రాజసే, యోగినాంమానసేధ్యాయసే, గీతవిద్యాదియోగాతితృష్ణేన కృష్ణేన సంపూజ్యసే భక్తిమచ్చేతసా వేధసా స్తూయసే, విశ్వహృద్యేనవాద్యేన విద్యాధరైర్గీయసే యక్షగంధర్వసిద్ధాంగనా మండలైర్మణ్డితే, సర్వసౌభాగ్య వాంఛావతీభి ర్వధూభిస్సురాణాం సమారాధ్యసే సర్వ విద్యా విశేషాన్వితం చాటుగాథా సముచ్చారణం కంఠముల్లోలసద్వర్ణ రేఖాన్వితం కోమలం శ్యామలోదారవక్షద్వయం తుండశోభాతిదూరీభవత్కింశుకాభం శుకం లాలయంతీ పరిక్రీడసే, పాణిపద్మద్వయేనాపరేణాక్షమాలాగుణం స్ఫాటికజ్ఞానసారాత్మకం పుస్తకం బిభ్రతీ యేన సంచింత్యసే, చేతసా తస్య వక్త్రాంతరాద్గద్యపద్యాత్మికా భారతీ నిస్సరే, ద్యేన వా యావకాభాకృతిర్భావ్యసే, తస్య వశ్యా భవంతి స్త్రియః పూరుషాః యేన వా శాతకుంభద్యుతిర్భావ్యసే, సోఽపి లక్ష్మీసహస్రైః పరిక్రీడతే, కిన్నసిద్ధ్యేద్వపుశ్శ్యామలం కోమలం చంద్రచూడాన్వితం తావకం, ధ్యాయత స్తస్యలీలాసరోవారిధిస్తస్య కేళీవనం నందనం, తస్యభద్రాసనం భూతలం, తస్య గీర్దేవతా కింకరీ, తస్య చాజ్ఞాకరీ శ్రీ స్స్వయం, సర్వయంత్రాత్మికే, సర్వమంత్రాత్మికే, సర్వతంత్రాత్మికే, సర్వముద్రాత్మికే, సర్వశక్త్యాత్మికే, సర్వచక్రాత్మికే, సర్వవర్ణాత్మికే, సర్వరూపే, హే జగన్మాతృకే, పాహి మాం, పాహి మాం, పాహి.

*****









## కౌసల్యామాత చేసిన - శ్రీరామరక్షాస్తోత్రం శ్లోక పారాయణం - శ్రీమద్రామాయణం

ఫలశ్రుతి: శ్రీమద్రామాయణం సకలశుభాలకీ నిలయం. వాల్మీకి మహర్షి అపూర్వ తపశ్శక్తితో లోకశ్రేయస్సు కోసం శ్రీమద్రామాయణాన్ని రచించాడు. వనవాసానికి వెళుతున్న శ్రీరాముడికి కౌసల్యామాత రక్ష కలగాలని దీవిస్తూ చేసిన శ్లోకాలు. ఇది అత్యద్భుత రామరక్షాస్తోత్రం, కౌసల్య రాముడి కోసం చేసిన స్తోత్రం. అనేకమైన విఘ్నములు కలిగించే భూతాలు, మనుషులు, రాక్షసులు పెట్టే కష్టాల నుండి మనలను బయటపడవేసే అపూర్వ స్తోత్రం. నిత్యం విజయం లభించాలంటే ఈ స్తోత్రపారాయణం భక్తితో చేసుకున్నవాడికి ఎటువంటి కష్టములున్నా, దుఃఖములున్నా, శత్రుపీడ ఉన్నా అవన్నీ తొలగిపోతాయి. శత్రువులు కూడా మిత్రులవుతారు. మన ప్రయాణాలప్పుడు తెలియకుండా వచ్చే కష్టాలు, మన పిల్లలకు తెలియకుండా వచ్చే ఇబ్బందులు, గండాలు, ఉద్యోగాలలో వచ్చే ఇబ్బందులు అన్నీ తొలగిపోతాయి. ముఖ్యంగా ఎనిమిదేళ్ళలోపు చిన్నపిల్లలకు ఇది వినిపిస్తే లేదా చదివించినా వాళ్ళకున్న గండాలన్నీ తొలగిపోతాయి, విద్యాభివృద్ధి కలుగుతుంది. ఈ స్తోత్రప్రభావం వల్లే అరణ్యవాసం కూడా శుభం కలిగించిందని, రావణుడిని వధించగలిగి, తన భార్య తనకు దక్కిందని శ్రీరామచంద్రుడే చెప్పాడు. మానవులకు ఉన్న ఇబ్బందులన్నీ తొలగడానికి ఈ స్తోత్రం చాలా అవసరం.

### అయోధ్యకాండము- 25 వ సర్గము (2-36 శ్లో)

నశక్యసే వారయితుం గచ్ఛేదానీం రఘూత్తమ |

శీఘ్రం చ వినివర్తస్వ వర్తస్వ చ సతాం క్రమే ||

యం పాలయసి ధర్మం త్వం ధృత్యా చ నియమేన చ |

స వై రాఘవశార్దూల ! ధర్మస్త్వామభిరక్షతు ||

యేభ్యః ప్రణమసే పుత్ర! చైత్యేష్వాయతనేషు చ |

తే చ త్వామభిరక్షంతు వనే సహ మహర్షిభిః ||

యాని దత్తాని తేఽస్త్రాణి విశ్వామిత్రేణ ధీమతా |

తాని త్వామభిరక్షంతు గుణైః సముదితం సదా ||

పితృ శుశ్రూషయా పుత్ర! మాతృశుశ్రూషయా తథా |

సత్యేన చ మహాబాహో! చిరం జీవాభిరక్షితః ||

సమిత్కుశపవిత్రాణి వేద్యశ్చాయతనాని చ |

స్థండిలాని చ చిత్రాణి శైలాః వృక్షాః క్షుపా హ్రదాః ||

పతంగాః పన్నగాః సింహాః త్వాం రక్షంతు నరోత్తమ |

స్వస్తి సాధ్యాశ్చ విశ్వే చ మరుతశ్చ మహర్షయః |

స్వస్తి ధాతా విధాతా చ స్వస్తి పూషా భగో ర్యమా ||

లోకపాలాశ్చ తే సర్వే వాసవ ప్రముఖాస్తథా |

ఋతవశ్చైవ పక్షాశ్చ మాసాస్సంవత్సరాః క్షపాః ||

దినాని చ ముహూర్తాశ్చ స్వస్తి కుర్వంతు తే సదా |

స్మృతిర్ధృతిశ్చ ధర్మశ్చ పాంతు త్వాం పుత్ర సర్వతః ||

స్కందశ్చ భగవాన్ దేవః సోమశ్చ స బృహస్పతిః |

సప్తర్షయో నారదశ్చ తే త్వాం రక్షంతు సర్వతః ||

యాశ్చాపి సర్వతః సిద్ధాః దిశశ్చ సదిగీశ్వరాః |

స్తుతా మాయా వనే తస్మిన్ పాంతు త్వాం పుత్ర నిత్యశః ||

శైలాః సర్వే సముద్రాశ్చ రాజా వరుణ ఏవ చ |

ద్యౌరంతరిక్షం పృథివీ నద్యః సర్వాః తథైవ చ ||

నక్షత్రాణి చ సర్వాణి గ్రహాశ్చ సహదేవతాః |

అహోరాత్రే తథా సంధ్యే పాంతు త్వాం వనమాశ్రితమ్ ||

ఋతవశ్చైవ షట్ పుణ్యా మాసాః సంవత్సరాస్తథా |



కలాశ్చ కాష్ఠాశ్చ తథా తవ శర్మ దిశంతు తే || 2.25.15

మహావనే విచరతో మునివేషస్య ధీమతః |

తవాదిత్యాశ్చ దైత్యాశ్చ భవంతు సుఖదాః సదా ||

రాక్షసానాం పిశాచానాం రౌద్రాణాం క్రూరకర్మణామ్ |

క్రవ్యాదానాం చ సర్వేషాం మాభూత్ పుత్రక తే భయమ్ ||

ప్లవగాః వృశ్చికాః దంశాః మశకాశ్చైవ కాననే |

సరీసృపాశ్చ కీటాశ్చ మా భూవన్ గహనే తవ ||

మహాద్విపాశ్చ సింహాశ్చ వ్యాఘ్రాః ఋక్షాశ్చ దంష్ట్రినః |

మహిషాః శృంగిణో రౌద్రాః న తే ద్రుహ్యంతు పుత్రక ||

నృమాంసభోజనా రౌద్రా యే చాన్యే సత్వ జాతయః |

మాచ త్వాం హింసిషుఃపుత్ర మయా సంపూజితా స్త్విహ ||

ఆగమాస్తే శివాః సంతు సిద్ధ్యంతు చ పరాక్రమాః |

సర్వసంపత్తయే రామ స్వస్తిమాన్ గచ్ఛ పుత్రక ||

స్వస్తి తే స్త్వంతరిక్షేభ్యః పార్థివేభ్యః పునః పునః |

సర్వేభ్యశ్చైవ దేవేభ్యో యే చ తే పరిపంథినః ||

గురుస్సోమశ్చ సూర్యశ్చ ధనదో థ యమస్తథా |

పాంతు త్వామర్చితా రామ! దండకారణ్యవాసినమ్

అగ్నిర్వాయుస్తథా ధూమో మంత్రాశ్చర్షి ముఖాచ్చ్యుతాః |

ఉపస్పర్శనకాలే తు పాంతు త్వాం రఘునందన ||

సర్వలోకప్రభుర్బ్రహ్మా భూతభర్తా తథర్షయః |

యే చ శేషాః సురాస్తే త్వాం రక్షంతు వనవాసినమ్ ||

ఇతి మాల్యైః సురగణాన్ గంధైశ్చాపి యశస్వినీ |

స్తుతిభిశ్చానురూపాభిః ఆనర్చా యతలోచనా ||

జ్వలనం సముపాదాయ బ్రాహ్మణేన మహాత్మనా |

హావయామాస విధినా రామమంగళకారణాత్ || 2.25.27

ఘృతం శ్వేతాని మాల్యాని సమిధః శ్వేతసర్షపాన్ |

ఉపసంపాదయామాస కౌసల్యా పరమాంగనా || 2.25.28

ఉపాధ్యాయః సవిధినా హుత్వా శాంతిమనాయమ్ |

హుతహవ్యావశేషేణ బాహ్యం బలిమకల్పయత్ || 2.25.29

మధు దధ్యక్షతఘృతైః స్వస్తివాచ్య ద్విజాం స్తతః |

వాచయామాస రామస్య వనే స్వస్త్య యనక్రియాః ||

తత స్తస్మై ద్విజేంద్రాయ రామమాతా యశస్వినీ |

దక్షిణాం ప్రదదౌ కామ్యాం రాఘవం చేదమబ్రవీత్ ||

యన్మంగళం సహస్రాక్షే సర్వదేవనమస్కృతే |

వృత్రనాశే సమభవత్ తత్తే భవతు మంగళమ్ ||

యన్మంగళం సువర్ణస్య వినతా కల్పయత్ పురా |

అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్ ||

అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్య యత్ |

అదితిర్మంగళం ప్రాదాత్తత్తే భవతు మంగళమ్ || 2.25.34

త్రీన్ విక్రమాన్ ప్రక్రమతో విష్ణోరమితతేజసః |

యదాసీన్మంగళం రామ తత్తే భవతు మంగళమ్ ||

ఋతవస్సాగరా ద్వీపా వేదా లోకా దిశశ్చ తే |

మంగళాని మహాబాహో దిశంతు తవ సర్వదా || 2.25.36

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



# ఉగాది & శ్రీరామనవమి విశేషాలు

## ఉగాది పూజావిధానం

ఆదిత్యాయ చ సోమాయ మంగళాయ బుధాయ చ |
గురు శుక్ర శనిభ్యశ్చ రాహవే కేతవే నమః ||

యుగాది అనే శబ్దమే, యుగమునకు ఆది అనే శబ్దమే ఉగాదిగా మారినది. దానినే సంవత్సరాది అని కూడా పిలుస్తున్నాం. సంవత్సరమునకు ఆరంభం అయ్యే తిథి కనుక, చైత్ర శుక్ల ప్రతిపత్ తిథిని అంటే పాడ్యమీతిథిని ఉగాది అంటారు. ప్రతి సంవత్సరం ఉగాది వస్తూనే వుంటుంది కదా, ఈ యుగాది నాడు మనం ఏమి చెయ్యాలి ? ఏమి చేస్తే మనకి సంపదలు వస్తాయి, శుభాలు పొందుతాం? వీటన్నింటి గురించి మన పురాణములు అన్నీ చెప్పినటువంటి మాటలు పరిశోధించి మీకు అందిస్తున్నాను. ఇలా చేస్తే సంవత్సరమంతా శుభఫలితాలు పొందుతాం. యుగాది నాడు ముందుగా చేయవలసింది - తలంటుకొని స్నానం చేయాలి. తెల్లవారుఝామున చక్కగా లేచి సూర్యోదయానికి ముందే నెత్తి మీద కాస్తంత చమురు పెట్టుకుని హాయిగా కుంకుడుకాయ పులుసుతో స్నానం చేయాలి. అభ్యంగనం ఆయువుని పెంచుతుంది. నేను చెప్పేది సాక్షాత్తు అగ్నిహోత్రుడు చెప్పిన మాట. అగ్నిహోత్రుడు ఆయువుని పెంచడం కోసం మనకో సలహా ఇచ్చాడు. మానవులకి చీటికీమాటికీ ఆయువులు తరిగిపోతూ ఉంటాయి. ఆయుర్దాయం ఎప్పుడు పెరుగుతుందో, ఎప్పుడు తరుగుతుందో మన పురాణాల్లో చెప్పారు. మనం పుణ్యములు చేస్తే ఆయువు పెరుగుతుంది, పాపాలు చెస్తే ఆయువు తరుగుతుంది. దుర్యోధనుడు ద్రౌపదీదేవి యొక్క కొంగు పుచ్చుకొని సభలోకి దుశ్శాసనుడితో ఈడిపించాడు. ఇంకేముంది వాడి ఆయువు తీరిపోయింది. అరవైఎనిమిదేళ్ళు ఇంకా బ్రతకవలసినవాడు ముందే చచ్చిపోయాడు. అందుకనే భాగవతంలో

"పాంచాలీ గబరీ వికర్షిత మహా పాప క్షతాయుష్కులన్"

అంటాడు. ద్రౌపదీ దేవి జుట్టు ముడి పట్టుకొని సభలోకి ఈడ్పించిన మహాపాపముచేత ధార్తరాష్ట్రులకు ఆయువు నశించింది. అందుకని కృష్ణుడు వారిని చంపించాడు తప్ప, ఆయనకేమీ వాళ్ళ మీద పగలేదు. కాబట్టి మనం చేసే పాపముల వల్ల ఆయువు తరుగుతుంది. పుణ్యముల వల్ల ఆయువు పెరుగుతుంది. ఆ పుణ్యకార్యములు ఉగాదినాడు చేస్తే ఆయువు అద్భుతంగా పెరుగుతుంది, ఆరోగ్యం పెరుగుతుంది. అందుకనే ఆయువు పెరగడానికి అందులో ఒక మార్గం అభ్యంగనం. అనగా నలుగు ఒంటికి పెట్టుకుని, కుంకుడుకాయ పులుసు నెత్తి మీద వేయించుకొని, తలంటుకొని స్నానం చెయటం అభ్యంగనం. షాంపూలతో స్నానం చెస్తే అభ్యంగనం కాదు, దాని వల్ల ఆయువు నశిస్తుంది. శుభ్రంగా కుంకుడుకాయ పులుసుతో పెట్టి తల రుద్దుకుంటే ఆయువు పెరుగుతుంది. ఆ తర్వాత ఏమి చెయ్యాలి ? ఇష్టదేవతా పూజ చెయ్యాలి. తప్పక మీకు ఇష్టమైన దేవుణ్ణి పూజించండి. గణపతి మొదలైనటువంటి దేవతలని పూజించండి. ఈ రోజు తప్పక లక్ష్మీ పూజ చెయ్యాలి. ఉగాది నాడు/ యుగాది నాడు ఆ లక్ష్మీ దేవి లోకసంచారం చేస్తుంది. అందుకని కాస్త విభూతి పెట్టుకొని కాని, ఊర్ధ్వపుండ్రాలను పెట్టుకోవటం గాని, బొట్టు గాని పెట్టుకొని ఇంట్లో లక్ష్మీ దేవి పటం లేక విగ్రహం పెట్టుకోండి. విగ్రహం వుంటే అభిషేకము కూడా చేసుకోండి.



శ్రీసూక్త పారాయణం ఉగాది నాడు చాలా మంచిది. "హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహ" అంటూ శ్రీ సూక్త పారాయణంతో భక్తితో లక్ష్మీదేవిని పూజించండి. మాకు శ్రీసూక్తం చదవటం రాదన్నవారు శ్రవణం చెయ్యవచ్చు, కాబట్టి వింటూ కూడా పూజ చేయండి.

లక్ష్మీదేవికి షోడశోపచారాలు ఇవ్వండి. ఈ రోజు మాత్రం తెల్ల పువ్వులు, ఎర్ర పువ్వులు లేక గన్నేరు పువ్వులు, పసుపుపచ్చ రంగులో వున్న గన్నేరు పువ్వులతో మహాలక్ష్మిని పూజిస్తే సకల సంపదలూ లభిస్తాయి. ఆయుః సంపద, ఆనంద సంపద, జ్ఞాన సంపద, మోక్ష సంపద, పుత్ర సంపద, ధనధాన్య సంపద ఇలా సకల సంపదలూ లక్ష్మీ కటక్షం వల్ల లభిస్తాయి.

ఉగాది నాడు రుద్రుని అభిషేకించాలని శాస్త్రం. పదకొండుమంది రుద్రుల రూపంలో ఉగాది నాడు శివుడు లోకసంచారం చేస్తాడు. అందుకే ఏకాదశి వారాలు గాని, ఒక వారం గాని రుద్రాభిషేకం చేయండి. రుద్రుణ్ణి అభిషేకించి అభిషేకజలాన్ని, పంచామృతాలని తీర్థంగా తీసుకోండి. యుగాది నాడు అన్నంతో రుద్రుణ్ణి అభిషేకించి ఆ అన్నం తాము ప్రసాదంగా తిని ఇతరులకు కూడా ఇంత అన్నాన్ని ప్రసాదంగా పెట్టినట్టువంటి వాడికి జీవితంలో అన్నపానీయాలకు లోటు వుండదు. అడవిలో పారవేసినా వాడికి వేళకింత అన్నం వస్తుంది. అందుకనే పెద్దలు యుగాది నాడు అన్నాభిషేకం చేయాలి అన్నారు.

కొన్ని చోట్ల ఇప్పటికి కూడా జ్యోతిర్లింగాలు వున్న చోట ఈ రోజు అభిషేకాన్ని అన్నంతో చేస్తారు. స్వామివారి లింగం అంతా అన్నం పోసి, అన్నం అలది ఆ తర్వాత అన్నాన్ని తీసి అందరికీ ప్రసాదంగా ఇస్తారు. ఆ అభిషేకం చూసినా, చేయించుకున్నా ప్రసాదంగా తిన్నా యావజ్జీవితం భుక్తికి లోటు వుండదు. ముందు భుక్తి వుంటే కదా ముక్తి సంగతి తర్వాత ఆలోచిస్తాం.

ఇక అన్నింటికంటే ఉత్తమ కార్యం ఏమిటి? యుగాదినాడు తప్పనిసరిగా వేప పూతతో చేసిన ఉగాది పచ్చడి తినాలి. అనేక రుచులతో, షడ్రుచులతో కూడిన గొప్ప పచ్చడి ఈరోజున తిని తీరాలి. అదే వేపపూతతో తయారుచేసిన పచ్చడి. వేపపువ్వులు, మామిడికాయ ముక్కలు, కొంతమంది కొన్ని చోట్ల మిరపకాయలు కూడా వేస్తారు, చెఱకు ముక్కలు, అరటిపండ్లు, దానిమ్మగింజలు ఇలా అన్నీ కలిపి ఆరు రుచులు వుండేలా చుసుకొని, తీపి, పులుపు, కారం, వగరు, చేదు ఇవన్నీ కలిపి పచ్చడి తయారుచేయాలి. ఈ పచ్చడి తయారుచేయగానే తినకూడదు. ఉగాది పచ్చడిని పూజామందిరానికి తీసుకెళ్ళి రుద్రునికి నైవేద్యం పెట్టాలి లేదా విష్ణువుకి నైవేద్యం పెట్టాలి. ముందు ఆ పచ్చడి పరమాత్మకి నివేదించాక అప్పుడు చేతిలోకి ఆ వేపపూత పచ్చడి వేసుకొని గురుదేవులను, నవగ్రహాలను తలచుకొని ఈ పచ్చడి తినాలి. ఈ వేపపచ్చడి వల్ల, ఉగాది పచ్చడి వల్ల, ఆయుర్వృద్ధిః - ఆయువు పెరుగుతుంది, యశో వృద్ధిః - కీర్తి పెరుగుతుంది, ధనవృద్ధిః - ధనం పెరుగుతుంది, ఆ తర్వాత బలవృద్ధిః - బలం పెరుగుతుంది అంటే ఇన్ని రకాల శుభఫలితములు కేవలం ఉగాది పచ్చడి వల్ల మనకి లభిస్తుంది.

ఇది అయ్యాక ఏమి చెయ్యాలి? ఆలయమునకు వెళ్ళి దర్శనం చేసుకోవాలి. తప్పక ఉగాది నాడు ఏదో ఒక ఆలయమునకు వెళ్ళండి. దేవతాదర్శనం చేసుకోండి. వీలుంటే అక్కడ అర్చనలు చేసుకోండి లేదా కనీసం రెండు చేతులూ జోడించి నమస్కరించండి. సూర్యుడు అస్తమించే లోపు ఉగాది నాడు పంచాంగాన్ని శ్రవణం చెయ్యాలి అంటే వినాలి. శ్రవణం అంటే వినుట, శ్రావణం అంటే వినిపించుట. గురుదేవులు వినిపించినది శ్రద్ధతో వినాలి, చెవులు రిక్కించి పంచాంగం గురించి చెబుతూ వుంటే ఎన్ని లాభాలుంటే అవన్నీ వినాలి. పంచాంగం వినకపోతే ఉగాది నాడు మనం ఎన్ని పూజలు చేసినా అవన్నీ వ్యర్థమైపోతాయిట. ప్రారంభంలోనే చెప్పారు తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములు అనే ఐదింటినీ పంచాంగం అని



పేరు. జ్యోతిష శాస్త్రంలో ఈ ఐదూ భాగాలన్నమాట. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం ఈ ఐదు పంచ అని సంస్కృతంలో పిలువబడతాయి. అంగము అంటే భాగం కాబట్టి పంచాంగము. ఇందులో "తిథేఃశ్రియమాప్నోతి" - తిథి గురించి తెలుసుకోవటం వల్ల సంపదలు వస్తాయి, ధనం వస్తుంది. ఈ రోజు పాడ్యమి, ఈరోజు విదియ, ఈ రోజు తదియ ఇలా తలచుకోవటం వల్ల, వాటిని గురించి తెలుసుకోవటం వల్ల సంపదలు పొందుతాం. "వారాత్ ఆయుష్య వర్ధనం" - ఈ రోజు ఆదివారం, ఈ రోజు సోమవారమని వాటిని తలచుకోవటం వల్ల ఆయువు పెరుగుతుంది. "నక్షతాత్ హరతే పాపం" - నక్షత్రముల వల్ల పాపం తొలగిపోతుంది. "యోగాద్రోగ నివారణం"- యోగముల గురించి తెలుసుకోవటం వల్ల రోగాలు తొలగుతాయి. ఇక "కరణత్ కార్యసిద్ధిశ్చ" - కరణముల గురించి తెలుసుకోవటం వల్ల కార్యసిద్ధౌతుంది.

"పంచాంగశ్చ ఫలంత్విదం" పంచాంగం వినటం వల్ల ఇన్ని లాభాలు వస్తాయి. అందువల్ల పంచాంగం వినాలి. పంచాంగంలో మహాత్ములైనటువంటి పండితులు, జ్యోతిష శాస్త్రవేత్తలు నాయనలారా ఈ సంవత్సరం పేరు శుభకృత్ లేక ఈ సంవత్సరం పేరు వికారి, ఈ సంవత్సరం పేరు శ్రీముఖ అని సంవత్సరముల యొక్క పేర్లు చెబుతారు. ఆ తరువాత సంవత్సరం మొత్తానికి ఫలితం చెబుతారు. విడివిడిగా మేషం మొదలుకొని మీనం వరకు గల పన్నెండు రాశుల యొక్క ఫలితములు చెబుతారు. వాళ్ళకి ఆదాయం ఎంత, వ్యయం ఎంత, రాజ్యపూజ్యమెంత, అవమానమెంత అనేవి చెబుతారు. ఈ మాస ఫలితాలు చెబుతారు. ఈ సంవత్సరంలో వచ్చే సంక్రాంతి ఎప్పుడు వస్తుంది, తర్వాత వరుసగా మకర సంక్రమణం మొదలుకొని పన్నెండు సంక్రమణలు ఎప్పుడు వస్తాయి. ఒకవేళ ఎక్కడైనా గ్రహణాలు వుంటే సూర్యగ్రహణం ఎప్పుడు వస్తుంది? సూర్య గ్రహణంతో పాటు చంద్రగ్రహణం ఎప్పుడొస్తుంది? ఆ గ్రహణాలు కూడా రాహుగ్రస్తమా? కేతుగ్రస్తమా? ఇవన్నీ చెబుతారు. కర్తరి గురించి, మూఢముల గురించి చెబుతారు. దీని వల్ల ముహుర్తాలు ఎప్పుడు వుంటాయి? అన్నీ తెలుస్తాయి. మనకి పూర్తిగా అర్థం కాకపోయినా కొంతవరకూ వీటిని గురించి తెలుసుకోవటం వల్ల మనకి జ్యోతిషశాస్త్ర సంబంధమైనటువంటి శుభ ఫలితాలు వస్తాయి. జాతక ఫలితాలు బాగుంటాయి, దోషాలు వుంటే తొలగిపోతాయి. కాబట్టి తప్పక ఈ రోజు పంచాంగం వినాలి. పంచాంగ శ్రవణం అయిన తరువాత పంచాంగం చెప్పిన వారిని గౌరవించుకోవాలి. వీలుంటే దక్షిణ ఇవ్వండి లేదంటే కనీసం ఒక్క నమస్కారం అయినా చెయ్యండి. వస్త్రాలని ఇవ్వాలని శాస్త్రం. ఈ రోజు అన్నదానం చాలా గొప్పది. సహజంగానే అన్నదానం చాలా గొప్పది. "న అన్నదాన సమం పుణ్యం", అన్నదానంతో చేయటం వల్ల వచ్చే పుణ్యంతో సమానమైన పుణ్యం మరొకటి లేదని అర్థం. అందుకని, ఉగాదినాడు పేదవాళ్ళకి లేకపోతే, బంధువులకే అందరికీ అన్నం పెట్టుకోమని చెప్పారు. భాగవతంలో అయితే "అధమ చండాలశునకసంహతికి తగిన భక్ష్యములు తెండు కసవులు పశులకిండు" పేదవాళ్ళకి, అధములకి, పశువులకి, కుక్కలకి వీళ్ళకందరికీ అన్నం పెట్టండి. గడ్డి వెయ్యండి. ఇలా ఉగాది నాడు చెయ్యటం వల్ల మీకున్న సకల దారిద్ర్యములు తొలగిపోతాయి, శుభములు కలుగుతాయి. ఇది కాక అన్నిటికంటే గొప్పది గురుదర్శనం. ఉగాది నాడు గురువుగారిని తప్పక చూడాలి. ఈ విషయంలో మనకి వేదవ్యాసులవారి చరిత్ర తప్పక వినితీరవలసినటువంటి కథ ఉంది. ఒకప్పుడు వేదవ్యాసులవారు పది వేల మంది శిష్యులతో తీర్థయాత్రలు చేసారు. వ్యాసుడు లేకపోతే పురాణాలు, చరిత్రలు లేవు. మత్స్య, మార్కండేయ, భవిష్య, భాగవత, బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, వరాహ, వామన, వాయు, విష్ణు, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాంద పురాణములనే ఈ పద్దెనిమిది పురాణములు లోకమునకు అందించిన మహాత్ముడు ఆయన. ఆయన దయ వల్లే అందరం శాస్త్రాలు తెలుసుకొని అంతో ఇంతో సుఖంగా వుంటున్నాం. అటువంటి పరమాత్ముడు వ్యాసుడు తీర్థయాత్రలు చేస్తూ చేస్తూ



మాయాపురానికి వెళ్ళాడు, అంటే హరిద్వారానికి వెళ్ళాడు. ఇవాళ హరిద్వార్ అంటున్నామే దానికి మాయాపురమని పేరు. సప్త మోక్ష పురాల్లో ఒకటి అది. అక్కడికి వెళ్ళగానే ఉగాది వచ్చింది. యుగాదికి ఆయనొక చెట్టు క్రింద కూర్చున్నాడు. ఆ సమయంలో కొంతమంది తీర్థయాత్ర చేస్తూ చేస్తూ అయ్యో తీర్థయాత్ర చేస్తున్నాం యుగాది వచ్చింది, గురుదర్శనం చేసుకోమని చెప్పారు. ఇక్కడ గురువులు ఎక్కడ దొరుకుతారు అనుకుంటుంటే వారి అదృష్టవశాత్తు హరిద్వార్ లో ఒక చెట్టు క్రింద శిష్యులకి పంచాంగాన్ని వినిపిస్తున్న వ్యాసుడు కనబడ్డాడు, వెంటనే ఈ భక్తులు ఆనందంతో వెళ్ళి సాష్టంగ నమస్కారం చేసారు. పంచాంగం విన్నాక ఆయన చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆ ప్రదక్షిణ చెయ్యగానే అందులో ఒక ఆయనకి కుష్ఠు రోగం, ఉన్న ఆయనకి కుష్ఠు రోగం టక్కున పోయింది. ఇంకొకాయనకి క్షయ రోగం అయినా తీర్థయాత్రలు చేస్తున్నడు వాడికి ఆ క్షయ పోయింది. ఆస్తమా రోగంతో వున్నవాడు ఉబ్బసంతో బాధపడుతున్నవాడికి ఆ రోగం పోయింది. వాళ్ళు తెల్లబోయి మహానుభావా! నీ చుట్టూ ప్రదక్షిణ చేయగానే ఈ రోగాలు పోయి ఇక ఇప్పుడు మేము తీర్థయాత్రలు హాయిగా చేస్తాం. ఏమిటి మాకీ రోగం పోవడానికి కారణం? ఎందువల్ల పోయింది? అని అడిగితే అప్పుడు ఆయన చెప్పారు-

యుగాది నాడు పంచాంగ పఠనం చెయ్యాలి లేదా ఎవరైనా పఠిస్తూ వుంటే వినాలి. ఇది అయ్యాక మహాత్ములైన గురువులకి నమస్కారం చేసి ప్రదక్షిణ చెయ్యాలి అని శాస్త్రము.

గురువులంటే ఎవరు? మంత్రోపదేశం చేసిన వాళ్ళు, పురాణములు చెప్పేవాళ్ళు సద్గురువులు. పాఠం చెప్పే గురువులు కూడా ఒకలాంటి గురువులు. వాళ్ళూ గురువులే కానీ వాళ్ళకంటే పౌరాణికులు, ఈ మంత్రోపదేశాలు చేసేవాళ్ళు సద్గురువులు అని పిలువబడతారు. అటువంటి వాళ్ళ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భయంకరమైన ఆధివ్యాధులు తొలగిపోతాయి. మీరు పరమపౌరాణికుడినైన నాకు ప్రదక్షిణ చేసారు, నమస్కరించారు. అందువల్లే మీ రోగాలు పోయాయి. యుగాది వచ్చిందంటే తప్పక మంత్రోపదేశం చేసిన లేక నిరంతరం పురాణములు చెప్పే గురువు చుట్టూ ప్రదక్షిణ చేస్తే దీర్ఘ వ్యాధులు తొలగిపోతాయి, నమ్మి చేసిన వాళ్ళకి శుభాలు కలుగుతాయి అని వ్యాసుడు ఆనతి ఇచ్చాడు. అప్పటినుంచి భక్తులు వ్యాసుడు చెప్పినట్టుగా గురుప్రదక్షిణ చేయటం మొదలుపెట్టారు. కాబట్టి మన అదృష్టం బాగుంది, మనం గురువుగారి సన్నిధానంలో వున్నాం అనుకొందాం కాసేపు. అప్పుడు వెంటనే ఏమి చెయ్యాలి? గురుదేవా! ఎంత యోగం పట్టింది మాకు అని వెంటనే ఆయన చుట్టూ ప్రదక్షిణ చెయ్యండి లేదా సాష్టంగ నమస్కారం చెయ్యండి. తోచిన దక్షిణ ఇవ్వండి. దాని వల్ల ముందు ఆయుర్ వృద్ధి - ఆయువు పెరుగుతుంది. దీర్ఘరోగాలు తొలగుతాయి, బ్రహ్మానందం కలుగుతుంది. అసలు ఉగాది నాడు చెయ్యవలసింది ముందు గురుస్తుతి, గురువందనం, గురుప్రదక్షిణ. ఒక్కోసారి దురదృష్టవశాత్తు గురువుగారు వెళ్ళిపోయారు, కాలాన్ని ఎవ్వరం ఆపలేము కాబట్టి, మరో గురువుంటే గురువు లేదా గురువుగారి పటాన్ని పెట్టుకొని ప్రదక్షిణ చేసినా అంతే ఫలితం వస్తుంది. కాబట్టి అది తప్పక చెయ్యాలి. ఇక ఈ రోజు ఈ తీర్థయాత్రల్లో ఎక్కడికైనా వెళ్ళగలిగితే, పూజలు అన్నీ అయ్యాక దైవదర్శనానికి వెళ్ళి క్షేత్రాల్లో వున్న పరమాత్మని చూడగలిగితే అది మహాయోగం. ఉగాది నాడు శాస్త్రప్రకారం గంగా స్నానం చేసి తీరాలని చెప్పారు. మేము కాశీ వెళ్ళలేము, గంగకి వెళ్ళలేము, స్నానం చెయ్యలేము మాకు గంగా స్నాన ఫలితం ఎలా వస్తుంది, అని కొంత మంది వ్యాసుడిని అడిగారు. అప్పుడాయన, ఈ రోజు ఆవుపాలని శివుడికి నివేదించండి. అలా నివేదించిన తర్వాత ఆవు పాలు నెత్తిమీద వేసుకోండి. ఆవు పాలు శిరస్సున జల్లుకున్నా ఒంటికి పూసుకున్నా గంగానదిలో స్నానం చేసిన ఫలితం వస్తుంది అన్నాడు. అంటే ఉగాది నాడు మనం గంగాస్నానం చేసిన ఫలితం పొందాలంటే ఆవు పాలు



కొంచెం ఒంటికి పూసుకోవాలి లేదా శిరస్సు పైన వేసుకోవాలి. "గో క్షీరం యాసాం క్షీరం యాసాంతు గంగావై కిం పవిత్ర మతః పరం" అని స్కాందపురాణం చెబుతోంది. “గోమయం యమునా సాక్షాత్ గోమూత్రం నర్మదా శుభా క్షీరం యాసాంతు గంగా వై కిం పవిత్ర మతఃపరం" - గోవు యొక్క పేడ (ఆవుపేడ) యమునా నది, ఆవు మూత్రం నర్మదా నది, ఇంక ఆవు పాలు సాక్షాత్తు గంగానది. అందుకే ఆవు పాలు ఒంటికి తగిలాయా, ఇంక మనం గంగా స్నానం చేసిన ఫలితం పొందుతాం. ఆవుపాలు కూడా దొరకలేదు పోనీ ఆ పాలు దొరికినా అవి కల్తీ, అప్పుడేం చెయ్యాలి? అందుకే పంచాంగం వినాలి. "శ్రీకల్యాణ గుణావహం రిపుహరం, దుస్స్వప్న దోషపహం గంగా స్నాన విశేష పుణ్య ఫలదం గోదాన తుల్యం నృణాం ఆయుర్ వృద్ధిదముత్తమం శుభకరం పంచాంగ మాకర్ణ్యతాం" అని పంచాంగ శ్రవణం యొక్క మహా ఫలితం ఏనాడో బృహస్పతి ఇచ్చాడు. ఈ శ్లోకం బృహస్పతిదని ప్రసిద్ధి. ఈ శ్లోకం ఉగాది నాడు అత్యంత భక్తితో, శ్రద్ధతో, నమ్మకంతో పంచాంగం వినండి, వింటే సకల శుభాలూ కలుగుతాయి. శుభాలతో పాటుగా రిపుహరం - శత్రువులు తొలగిపోతారు. గోదాన తుల్యం నృణాం — ఆవును దానం చేస్తే అంటే భక్తితో, శ్రద్ధతో గోదానం చేయటం వల్ల వచ్చే ఫలితం పంచాంగం వింటే వస్తుంది. గంగాస్నానవిశేషపుణ్యఫలదం - నిత్యం విడిచిపెట్టకుండా సంవత్సర కాలం పాటు గంగా స్నానం చెయ్యటం వల్ల వచ్చే మహా ఫలితం పంచాంగం వింటే లభిస్తుంది. శ్రద్ధతో, భక్తితో పండితుడైన వాని ద్వారా పంచాంగమును వినాలి. పంచాంగం ఎప్పుడూ కూడా పండితులు చెప్పిన్నప్పుడు వినాలి. సంస్కృతం, తెలుగు తెలియకుండా, దుష్ట సమాసాలు చేసే వారి దగ్గర పంచాంగం వింటే పెద్ద ఫలితం వుండదు. అపశబ్దములతో కూడిన పంచాంగం కాకుండా సుశబ్దములతో కూడినటువంటి పంచాంగ శ్రవణం చెయ్యండి. మంచివాళ్ళు, మహానుభావులు దేశంలో, తెలుగు నాట గొప్ప గొప్ప పండితులు వున్నారు. అటువంటి వాళ్ళు మహానుభావులు పంచాంగం వ్రాసేవాళ్ళు, పంచాంగాలు చెప్పేటటువంటి వాళ్ళు చెబుతూవుంటే శ్రద్ధతో వింటే గంగా స్నానం చెయ్యటం వల్ల వచ్చే మహా ఫలితం వస్తుంది. అయితే గంగలో స్నానం చెయ్యాలి లేదా పంచాంగం విని గంగాస్నానమహాఫలితం పొందాలి.

ఇక తర్వాత ఏమి చెయ్యాలి? ఈ రోజు వీలుంటే భార్యకి క్రొత్త బట్టలు కూడా ప్రసాదించమన్నారు. భార్యని గౌరవించి ఆవిడకి చీర పెట్టినటువంటి వాడు కూడా సకల శుభాలూ పొందుతాడు. తప్పక లక్ష్మీ పూజ చెయ్యలి, సాయంత్రం వేళ ఏదన్నా లక్ష్మీ దేవి యొక్క ఆలయానికి వెళ్ళి సంధ్యాసమయంలో అక్కడ దీపం పెట్టినా, దీపం పెడుతూవుంటే చూసినా, భక్తితో నమస్కరించినా కూడా యుగాది నాడు లక్ష్మీకటాక్షం లభిస్తుంది. ఇది కాక లక్ష్మీదేవి మనకిచ్చిన ఒక సలహా వుంది - నాయనలారా ! సంవత్సరాది రాగానే ఆ రోజున గోవులను భక్తితో పూజించండి లేదా గోవులకు ప్రదక్షిణ చెయ్యండి. గోప్రదక్షిణ వల్ల మొత్తం భూమండలం ప్రదక్షిణ వల్ల వచ్చే లాభం వస్తుంది. గోవులను పూజించటం వల్ల లక్ష్మీదేవి నేను మీ ఇంట్లో వుంటాను అన్నది. అందువల్లనే పూర్వ కాలంలో చింతామణి అనే ఒకాయన వుండేవాడు. పాపం ఏదో దురదృష్టవశాత్తు పేదవాడైపోయాడు. సంపదల్లేకే మధనపడుతూ ఒక రోజున సనకసనందనాదుల దగ్గరకు వెళితే సనకసనందనాదులు లక్ష్మీదేవి చెప్పిన మాటే అతనికి చెప్పి యుగాది నాడు అనగా సంవత్సరాది నాడు ఆవుల చుట్టూ ప్రదక్షిణ చెయ్యి, ఆవులను భక్తితో పూజించు, ఆవులకి ఇంత గడ్డి పెట్టు సంవత్సరం తిరిగే లోపు నీకు సకల సంపదలూ వస్తాయి, లక్ష్మీకటాక్షం వస్తుందని చెప్పారు. వెంటనే ఈ చింతామణి శాస్త్రి ఆవులకి ప్రదక్షిణ చేసాడు, ఆవులని పూజించాడు.

సనకసనందనాదులు చెప్పారు కనుక ఆయన నమ్మి ఆ పని చేసాడు. అదృష్టవశాత్తు కొంత గడ్డి కూడా పట్టుకొచ్చి ఈ ఉగాది నాడు ఆవులకి పెట్టాడు. వాటికి



ఆహారం పెట్టాడో లేదో వెంటనే ఆకాశవాణి రూపంలో లక్ష్మీదేవి నాయనా రేపటినుంచి నీకు క్రమక్రమంగా సంపదలు అభివృద్ధి అవుతాయి. ఉగాది నాడు నువ్వు గోపూజ చేసావు, గోవులకి ఆహారం పెట్టావు, ఇక నీకు తిరుగులేదు అన్నది. అన్నట్టే ఆయన సంవత్సరం తిరిగే లోపు మహైశ్వర్య సంపన్నుడైపోయాడు. కాబట్టి కటికదారిద్యం తొలగించి సకల సంపదలను ఇచ్చే దివ్యమైనటువంటి కాలం యుగాది కాలం. కాబట్టి ఈ రోజు గోప్రదక్షిణ, గోపూజ చెయ్యండి. తప్పక ఎంతో కొంత పురాణం కూడా వినండి. పురాణం దానం చెయ్యండి. అవకాశమున్నవాళ్ళు పురాణాలు పూజించడం, పురాణాలను దానం చెయ్యటం చాలా గొప్పది.అందునా మత్స్య పురాణం, స్కాంద పురాణం యుగాది నాడు దానం చేస్తే వారికి పునర్జన్మ వుండదని శాస్త్రం. ఆ రోజు దానం చెయ్యటానికి కుదరలేదనుకోండి, మీ గురువుగారు మీ దగ్గర లేరనుకోండి, అప్పుడు ఆ పురాణములు కొని పూజ మందిరంలో పెట్టి మా గురువుగారికి ఇస్తున్నాను లేక ఫలానా పండితునికి ఇస్తున్నాను అని చెప్పుకొని ఆయన దొరికినప్పుడు కూడా దానం చెయ్యమన్నారు. ఏది ఏమైనా ఈ రోజున పురాణములు వినడం, భగవత్ పూజ చెయ్యటం, గురువులను సేవించడం చాలా మంచిది. భక్తులందరూ ఈ కార్యక్రమాలు చేసి సకల శుభాలు పొందండి.

*****

బలం గురోః ప్రవర్ధతాం

బలం గురోః ప్రవర్ధతాం

బలం గురోః ప్రవర్ధతాం

## చైత్ర శుద్ధ నవమి- శ్రీ రామ నవమి

శ్రీ మహావిష్ణువు ఎత్తిన పది అవతారాలలో శ్రీ రామవతారం 7వ ది, శ్రీ రాముడు దశరథునకు కౌసల్య గర్భమున చైత్ర శుద్ధ నవమి నాడు జన్మించారు. ఈ రోజు చేయవలసిన మఱియు ఆచరించ వలసిన విధి విధానాలు మన పూజ్య గురువు గారి మాటల్లో తెలుసుకుందాం, ఇలా చేయడం వల్ల సంవత్సరం అంతా శుభ ఫలితాలు తప్పక పొందుతాము.ప్రొద్దున్నే సూర్యోదయం ముందు లేచి తల స్నానం చెయ్యాలి. ఇష్ట దేవత ఆరాధన తప్పక చేయాలి. ఈ రోజు సీతరామ లక్ష్మణ, హనుమంతుడు ఉన్న చిత్రపటం తీసుకొని షోడశోపచారాలు చేయాలి శాస్త్రం. శ్రీ రామచంద్ర ప్రభువుని యథాశక్తి శ్రీ సూక్తం , పురుష సూక్తం తో అర్చన చేయడం చాలా మంచిది. విగ్రహాలు ఉంటే భక్తి పూర్వాకంగా పంచఆమృతాలుతో జలంతో అభిషేకించాలి, ఉత్సవ మూర్తులు లేకపోతే మట్టి విగ్రహాలు ఉన్నా చేసుకోవచ్చు.





ఈ రోజు శ్రీ రామచంద్రునకు అత్యంత ఇష్టమైన పురుష సూక్తం తో అభిషేకించకోవచ్చు. ఇవి ఏమి కుదరకపోతే శ్రీ రామునికి అష్టోత్తరశతనమవాళి తో పూజ చేసుకున్న అదే ఫలితం వస్తుంది.ఈ రోజు తప్పక శ్రీరామచంద్ర ప్రభువునకు సంబంధించిన స్తోత్ర పారాయణ తప్పక చేయాలి. ముఖ్యంగా ఈ రోజు రామ రక్ష స్తోత్రం లేదా సంక్షిప్త రామాయణం పారాయణ చేయడం చాలా చాలా మంచిది. ఇది చేయడం వలన సంపూర్ణ రామాయణం చేసిన ఫలితం వస్తుంది.ఈ రోజు తప్పక ఆలయ దర్శనం చేసుకోవాలి.ఈ అపూర్వమైన పుణ్య తిథి రోజున చేసిన దానం గాని, పూజ గాని, ప్రదక్షిణలుగాని ఈ రోజు చేసిన ఏ శుభపని అయిన కొంచం చేస్తే కొండంత ఫలితం ఇస్తుంది.ఈ రోజు గురువులకి నమస్కరించాలి, గుళల్లో ప్రదక్షిణలు చేయాలి.ఈ రోజు 1000సార్లు గాని 3000సార్లు గాని గారడి విద్య మంత్రం జపం చేయడం చాలా శుభప్రదం. ఉదయం 10గం॥00॥ని నుండి 12గం॥00॥ మధ్య చేయడం ఉత్తమం. ఈ రోజు అవకాశం ఉన్నవాళ్లు బెల్లం, మిరియాలు తో చేసిన పానకంని తయారుచేసి స్వామి వారికి నివిధించిన తరువాత మనం స్వీకరించాలి.ఈ రోజు శ్రీ రామునికి తులసి దళాలతో అర్చించడం చాలా మంచిది. దీని వలన పూర్తి ఆయుర్ధం వస్తుంది.ఇవి ఏమి చేయలేకపోయిన రామ నామజపం చేసిన సమస్త తపములు తొలగుతాయి అని శాస్త్రము.ఈ రోజు మన శ్రీ ప్రణవ పీఠంలో శ్రీ సీతరామచంద్ర ప్రభువకు అత్యంత వైభవముగా పూజ మరియు కళ్యాణం జరుగుతుంది.

*****

## శ్రీ ప్రణవపీఠ సత్సంగ సమాచారం

### శ్రీ వేంకటేశ్వర విలాసం పారాయణం

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారికి జయము. ఏడుకొండల వాడిని దర్శనం చేసుకోని తెలుగు వారు ఉండరు. ఎన్ని సార్లు దర్శించినా స్వామి దివ్య మంగళ రూపాన్ని మళ్ళీ మళ్ళీ చూసి తరించాలి అని అనిపిస్తుంది. శ్రీ వారి వైభవం ఎంత తెలుసుకున్నా హరి భక్తులకు ఇంకా ఇంకా తెలుసుకోవాలి అనే కుతూహలము కలుగుతుంది. పండితులకు మాత్రమే తెలిసిన ఏడుకొండల రహస్యములను సామాన్యులైన మన అందరికి శ్రీ వేంకటేశ్వర విలాసం పేరుతో అందించారు శ్రీ ప్రణవపీఠాధీశులు, పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. శ్రీ వేంకటేశ్వర విలాసాన్ని అద్భుతమైన దివ్యమైన 30 రోజుల పారాయణ గ్రంథముగా అందించారు శ్రీ గురువుగారు.

భక్తులందరూ 30 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పారాయణం చేసుకోవలసిందిగా గురువుగారు ఆదేశించారు. శ్రీ వేంకటేశ్వర విలాసం పారాయణం చేయటము అంటే ఏడుకొండలలోని అన్ని తీర్థములలో స్నానం చేసి శ్రీవారిని దర్శించటమే. శ్రీ వారిని వెయ్యి సార్లు అభిషేకిస్తే కలిగే



పుణ్యం, భక్తితో స్వామి లీలల్ని విన్నా, చదివినా, తెలుసుకున్నా కలుగుతుంది.శ్రీ వారి లీలా విశేషాలు అన్నీ మన భాగ్యవశాత్తు పూజ్య గురుదేవులు మనకు అందించారు. మనకు కలిగిన ఈ అదృష్టమును సద్వినియోగం చేసుకొని గురుకరుణకు, శ్రీ వారి కరుణకు పాత్రులు అవుదాం. శ్రీ వేంకటేశ్వర విలాసం లో దరిద్రములు తొలగించి సంపదలు ఇచ్చు వ్యూహలక్ష్మీ దేవి వైభవం ఉన్నది. ఉద్యోగం ప్రాప్తింపచేసే భీముని చరిత్ర ఉన్నది. మోక్షమును కూడా ప్రసాదించగల స్వామి



పుష్కరిణి చరిత్ర ఉన్నది. ఎన్నో ఎన్నెన్నో లీలలు గురుదేవులు మనకు అందించారు.

పూజ్య గురుదేవులు శ్రీ వేంకటేశ్వర విలాసాన్ని అందించాక శ్రీ జగదీష్ గారి కార్యాచరణతో అంతర్జాల సామాజిక మాధ్యమమైన జూం ద్వారా శ్రీమతి శైలజగారు, శ్రీమతి జ్యోతిగారు తొలిసారి శ్రీ వేంకటేశ్వర విలాసాన్ని పారాయణం చేసి తరించారు. శ్రీ మల్లికార్జున గారి బృందం సాంకేతిక సహకారంతో ఎన్నోసార్లు ఏకాహ దీక్షతో గురు భక్తులు అందరూ శ్రీ వేంకటేశ్వర విలాసమును పారాయణం చేసుకున్నారు. శ్రీ మతి జ్యోతిగారు ఇంటి ఇంటికి శ్రీ వేంకటేశ్వర వైభవము చేరాలని, గురు కృప, స్వామి అనుగ్రహం అందరికీ కలగాలని ఒక బృందాన్ని ఏర్పాటు చేసారు. శ్రీమతి జ్యోతిగారు మరియు వారి బృందం ప్రతి శనివారం 25 సార్లు శ్రీ వేంకటేశ్వర విలాసాన్ని భక్తులతో సామూహిక పారాయణం చేయిస్తున్నారు. శ్రీనివాసుడు పుస్తకరూపం ధరిస్తే అది శ్రీ వేంకటేశ్వర విలాసం అవుతుంది. కావున భక్తులు అందరు శ్రీ వేంకటేశ్వర విలాసమును భక్తి తో పారాయణం చేసి సకల శుభాలు పొందండి. "ఏడుకొండలవాడా, వేంకటరమణా గోవిందా గోవిందా!" పూజ్య గురుదేవుల వెబ్సైట్ లో శ్రీ వేంకటేశ్వర విలాసం పుస్తకం అందుబాటులో ఉంది.

(లింక్:https://shop.srivaddipartipadmakar.org/product/sri-venkateswara-vilasam/?_gl=1*yd1uzm*_ga*MTc3MDE2ODM1Mi4xNjQ4NDYyMTMx*_ga_FD91PXPR16*MTY0ODQ2MjEzMC4xLjEuMTY0ODQ2MjEzMC4w&_ga=2.143046965.1074754301.1648462131-1770168352.1648462131 )

## హనుమద్ వైభవం నుండి ప్రసంగపు పోటీలు, చిత్రలేఖనపు పోటీలు





హనుమంతుని గురించి (హనుమద్ వైభవం లోని విశేషాలు) ప్రసంగపు, మరియు చిత్రలేఖనపు పోటీలు ఏప్రిల్ 16, 17, 23, మరియు 24 తేదీలలో

పూజ్యగురుదేవులు వద్దిపర్తి పద్మాకర్ గారికి జయము జయము. యుగములు గడిచినా, మన్వంతరములు గడిచినా, కల్పములు గడిచినా, రామ నామమునకు సాటి వచ్చేది ఏదీ లేదు, ఆ రాముడిని సీతాలక్ష్మణ సమేతముగా హృదయం లో నిలుపుకున్నారు స్వామి హనుమ. స్వామి హనుమ వైభవమును పూజ్యగురుదేవులు మన అందరికీ అందించారు. హనుమద్ జన్మతిథి సందర్భంగా శ్రీ ప్రణవపీఠ శిష్య బృందం పూజ్య గురుదేవులు ప్రవచించిన హనుమద్ వైభవం నుండి ప్రసంగపు పోటీలు, చిత్రలేఖనపు పోటీలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 2, 2022 నుండి ఏప్రిల్ 9, 2022 వరకు పోటీలలో నమోదు చేసుకోవచ్చు. పోటీలలో నమోదు చేసుకోవటానికి

క్రింద ఇవ్వబడిన వెబ్సైటు లింకు ను సందర్శించగలరు

https://srivaddipartipadmakar.org/pranava_forms/prasangapu-potilu-2022-registration/

పూజ్య గురుదేవులు అందించిన హనుమద్ వైభవం ప్రవచనపు యూట్యూబ్ లింక్ :

https://youtube.com/playlist?list=PLfgDt5ZsV1JIpfU4f_zthSFKiFgq0xHoT